# ప్రజాభూమి
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com





వినయంలేని విద్య
సుగుణంలేని రూపం
ఉపయోగం కాని ధనం
శౌర్యంలేని ఆయుధం
ఆకలిలేని భోజనం
పరోపకారం చేయని జీవితం వ్యర్థం


తెలంగాణ ఎడిటర్ విప్పల చంద్రశేఖర్ | శనివారం | 28.12.2024 | పేజీలు : 08 | నమూన సంచిక | వెల : అమూల్యం


## కేటీఆర్ మధ్యంతర బెయిల్ పొడిగింపు





హైదరాబాద్, ప్రజాభూమి

ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశం మేరకు ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ కోరింది. కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న ఉత్తర్వులను ఈ నెల 31వ తేదీ మిగతా 2లో...

## పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న సర్పంచ్‌లు




హైదరాబాద్,ప్రజాభూమి

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ మిగతా 2లో...





## మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

- ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోడీ, అమిత్ షా తదితరుల శ్రద్ధాంజలి
- మన్మోహన్‌కు సోనియా, రాహుల్, ఖర్గేనివాళి
- కేబినేట్ భేటీలో ఘనంగా నివాళి
- మన్మోహన్‌కు రేవంత్ నివాళి
- పార్థివదేహం వద్ద మంత్రులతో కలిసి శ్రద్ధాంజలి
- వారంపాటు దేశంలో సంతాపదినాలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రధాన కార్యాలయాలపై జాతీయజెండా అవనతం







## నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్




- దేశం కోసమే తన జీవితాన్ని ధారపోశారు
- మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం
- సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం

న్యూఢిల్లీ,ప్రజాభూమి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ వర్కిం గ్ కమిటీ సంతాప తీర్మానం చేసింది. మన్మోహన్ వారస ˇత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఆయన నిజమైన రాజనీతి జ్ఞుడని, దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారని గుర్తు చేసుకున్నారు. ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై సంతా ప తీర్మానం చేశారు. శనివారం జరిగే మన్మోహన్‌సింగ్ అంతిమసంస్కారాల నిర్వహణపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక, తదితర నేతలంతా పాల్గొన్నారు. భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగంలో మన్మోహన్ ఒక మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన కృషి దేశాన్ని మార్చివేసిందని తెలిపింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిం దని గుర్తుచేసుకున్నారు. 1990 ప్రారంభంలో మిగతా 2లో...

## న్యూ ఇయర్ గిఫ్ట్‌ల పేరుతో మోసం

- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్




హైదరాబాద్,ప్రజాభూమి

కొద్దిరోజుల్లో కొత్త సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాము. అయితే కొత్త సంవత్సర వేడుకలపై సైబర్ కేటుగాళ్లు ఫోకస్ పెట్టారు. న్యూయర్ విషెస్ అంటూ అమాయకులను దోచుకునే ప్లాన్‌లో ఉన్నారు. దీనిపై ముందుగానే అలర్ట్ అయిన సైబర్ క్రైం అధికారులు ప్రజలకు తగు సూచనలు జారీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజలకు సీనియర్ ఐపీఎస్, టీజీ ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా హెచ్చరిం చారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో ఉన్నదంతా దోచుకునేం దుకు సైబర్ నేరగాళ్లు ప్లాన్ వేశారని, అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు, ఫోన్లలో ఉన్న వ్యక్తి గత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుందన్నారు. న్యూ ఇయర్ విషెస్ చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకొని ఇతరులకు మిగతా 2లో...

## తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

- జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షల నిర్వహణ

హైదరాబాద్,ప్రజాభూమి



తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. జనవరి 2 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు సెషన్- 1; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 2, 5, 11, 12, 19, 20 తేదీల్లో ఆరు రోజులు పేపర్ -2 పరీక్షలు జరగనుండగా.. జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నాలుగు రోజులు పేపర్ -1 పరీక్షలు నిర్వహిస్తారు. నవంబర్ మిగతా 2లో...

# నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక మంత్రిగా భారతదేశ ఆర్థిక సరళీకరణకు రూపశిల్పి అని కొనియాడారు. అసమాన మైన దూరదృష్టితో వరుస సంస్కరణలను ప్రారంభించార న్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించడమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు కూడా తలుపులు తెరిచా యని స్మరణచేసుకున్నారు. నియంత్రణ సడలింపు, ప్రైవేటీకరణ మరియు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి విధానాల ద్వారా భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి పునాది వేశారని నేతలు నెమరువేసుకున్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ లలో ఒకటిగా ఉద్భవించిందని కొనియాడారు. ఇది ఆయన ప్రతిభ, దార్శనికతకు నిదర్శనం అని సీడబ్ల్యూసీ పేర్కొంది. నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని పేర్కొంది.

## న్యూ ఇయర్ గిఫ్ట్‌ల పేరుతో మోసం

మొదటిపేజీ తరువాయి

పంపవచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని స్మార్ట్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నారు. పొరపాటున వాటిపై క్లిక్ చేశారంటే తిప్పలు తప్పవన్నారు. ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్(ఏపీకే) రూపంలో పంపే ఈ గూఢచర్య అప్లికేషన్ ఒకసారి ఫోన్లోకి జొరబడిందంటే అందులోని సమస్త సమాచారం నేరగాళ్ల అధీనం లోకి వెళ్లిపోతుందన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నంబర్లు, ఇతర అన్నీ తీసేసుకుంటారు. కాబట్టి నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇప్పటికే పెద్ద ఎత్తున సందేశాలు పంపుతున్న సైబర్ కేటుగాళ్లు రాబోయే రెండు, మూడు రోజుల్లో తమ దాడుల్ని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.. జాగ్రత్త!! అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు.

## కేటీఆర్ మధ్యంతర బెయిల్ పొడిగింపు

మొదటిపేజీ తరువాయి

వరకు కోర్టు పొడిగించింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని వారం రోజుల క్రితం హైకోర్టు ఏసీబీని ఆదేశించిన సంగతి తెలిసిందే.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

మొదటిపేజీ తరువాయి

కమిటీ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్‌ల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను మభ్యపెట్టకుండా.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గాని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టెట్ హాల్ టిక్కెట్లు విడుదల


మొదటిపేజీ తరువాయి

7 నుంచి 20 వరకు టెట్‌కు దరఖాస్తులు స్వీకరించగా.. దాదాపు 2.75లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కు సంబంధించిన హాల్ టికెట్లను టీజీ టెట్ కన్వీనర్ శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు. ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డుల్లో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీని తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

## నోరు తెరిస్తే సీఎం రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

### - బీసీల జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్ ఎలా ప్రకటిస్తారు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ప్రజాభూమి



సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతాడని, అందులో భాగంగానే ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చాడని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి వీల్లేదని కవిత అన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నదని చెప్పారు. బీసీ సంఘాలతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల జనాభా ఎంతో తెలికుండా హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా బీసీలు ఉన్నారని చెప్పారు. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో అంతుపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. మండల కేంద్రాలు, జిల్లాల్లో నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ఎన్నికలపై ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదని చెప్పారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తామన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిందని విమర్శించారు.

# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ,ప్రజాభూమి

భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో దేశ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాం లో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు. అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంది. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధాని గా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురాను న్నారు. శనివారం రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.



### మన్మోహన్‌కు సోనియా, రాహుల్ నివాళి

భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) పార్థివ దేహానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా అపారమైన జ్ఞానం, సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. ఆయనలోని వినయం, ఆర్థికశాస్త్రంపై ఆయనకున్న లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తినిచ్చాయి. నా జీవితంలో ఎంతో ముఖ్యమైన ఓ గురువును కోల్పోయాను' అని అన్నారు. ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రా సైతం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. మన్మోహన్ ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై ఆయనకు చాలా జ్ఞానం ఉందని అన్నారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంతో మన్మోహన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. గురువారం రాత్రి ఆయన మరణవార్త తెలియడంతో కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలను అర్ధంతరంగా ముగించి.. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే దిల్లీకి బయలుదేరారు. దిల్లీలోనే ఉన్న సోనియా, ప్రియాంక ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. శనివారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మన్మోహన్ పార్థివ దేహాన్ని ఆయన నివాసంలో ఉంచారు. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

### మన్మోహన్‌కు రేవంత్ నివాళి

మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ ఎంపీలు ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్ వద్ద ఉన్న మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్నారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం భారతదేశ ప్రజలకు తీర్చలేనటువంటి లోటన్నారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధాని మంత్రిగా ఉన్నప్పుడు మొట్ట మొదటిసారిగా మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక శాఖ మంత్రి నియమించారని గుర్తు చేశారు. 15 టన్నుల బంగారాన్ని కుదవపెట్టి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారన్నారు. భారతదేశ ఆర్థిక పరిస్థితి కుదేలైన సమయంలో ప్రధానిగా పీవీ నరసింహారావు, ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ వచ్చారని వెల్లడించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గల ముఖ్య కారకుడు మన్మోహన్ సింగ్ అని మల్లు రవి కొనియాడారు. ఆ ఐదు సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులను బయటపడి ప్రగతి పథంలో ముందుకు వెళ్ళిందన్నారు. మన్మోహన్ సింగ్ అంటేనే సంస్కరణలకు పెట్టింది పేరని.. దేశం ఒక మహా నేతను కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన సంస్కరణల అడుగుజాడల్లోనే తదుపరి వచ్చిన ప్రధాన మంత్రులు నడుచుకున్నారని స్పష్టం చేశారు. ఆయనను గొప్ప ప్రధానిగా గుర్తించి సేవలను అందరూ తలచుకుంటున్నారన్నారు.

### మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం

మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌జీ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక రాజనీతిజ్ఞుడని కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల నుంచి ప్రధానమంత్రిగా ఎదిగి దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని అన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. ఆయన కుటుంబానికి, ఆత్మీయులకు, అభిమానులకు సానుభూతి తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విచారం వ్యక్తం చేశారు. అతని దూరదృష్టి విధానాలు, ఆర్థిక సంస్కరణలు భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదగడానికి పునాది వేసిందని జగన్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం అత్యంత బాధాకరమని షర్మిల అన్నారు. భారత దేశ ఆర్థికశిల్పి మరణం దేశానికి తీరని లోటని వివరించారు. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, మన దేశానికి అందించిన సేవలు అమూల్యమని అన్నారు.

## మన్మోహన్ మృతికి కాంగ్రెస్ సంతాపం

### - వారంపాటు రాజకీయకార్యకలాపలకు దూరం
### - పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్,ప్రజాభూమి



మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతితో వారం రోజుల పాటు సంతాప దినాలుగా కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వం కార్యాలయాలకు, విద్యాసంస్థలకు శుక్రవారం సెలవును ప్రకటించారు. నేటి కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలతో పాటు జనవరి 3వ తేదీ వరకు అన్ని రాజకీయ కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతికి ఆయన సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ సద్గుణం, నిష్కళంకమైన చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి అని అన్నారు. నవ భారతదేశానికి నిజమైన వాస్తుశిల్పిలలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒకరని అన్నారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసినట్లు తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావిగా ఆయన్ను కొనియాడారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ చేసిన సేవలు దేశం ఎన్నటికీ మరిచిపోదన్నారు. నిజాయితీ, మంచితనం, సమర్థవంతంగా పని చేయడంలాంటివి మన్మోహన్ సింగ్ ను చూసి నేర్చుకోవాలన్నారు.

## నిమ్స్‌లో ఓపీ సేవలు బంద్




హైదరాబాద్, ప్రజాభూమి


భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి దేశమంతా నివాళులర్పిస్తోంది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి కూడా మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించింది. అయితే మాజీ ప్రధాని మృతికి నివాళిగా శుక్రవారం ఓపీ(ఔట్ పేషెంట్) సేవలను నిలిపివేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప ప్రకటించారు. కేవలం ఎమర్జెన్సీ, క్యాజువలిటీ సర్వీసులు మాత్రమే పని చేస్తాయని పేర్కొన్నారు. ఓపీ సాధారణ సేవలు డిసెంబర్ 28 నుంచి అందుబాటులోకి వస్తాయని డాక్టర్ బీరప్ప స్పష్టం చేశారు. ఓపీ సేవలను ఆకస్మికంగా నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము ఎక్కడ చూయించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్లు ఎలాంటి ప్రకటన చేయకపోవడం, ఇక్కడికి వచ్చాక సేవలు నిలిపివేసినట్లు తెలియడంతో రోగులు, వారి అటెండర్లు నిమ్స్ డాక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మన్మోహన్ కేబినేట్‌లో పనిచేయడం అదృష్టం

**తెలంగాణతో ఆయనది ప్రత్యేక అనుబంధం**
**రాష్ట్ర ఏర్పాటుకు సహకరించారని కెసిఆర్ ప్రకటన**
**మన్మోహన్ అంత్యక్రియల్లో బిఆర్ఎస్ నేతలు**
**ఘనంగా నివాళి అర్పించనున్న కెటిఆర్ బృందం**
**కెసిఆర్ ఆదేశాలతో హస్తినకు పయనం**

హైదరాబాద్,ప్రజాభూమి

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమయంలో ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనది. తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌కు భారాస తరఫున ఘన నివాళులు' అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీకి బయల్దేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ ఎంపీలు, పలువురు నాయకులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళులర్పించనుంది. అంత్యక్రియల్లో పాల్గొని మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని కేసీఆర్ పేర్కొన్నారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో



మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరుకానున్నారు అని కేసీఆర్ తెలిపారు.

# కానిస్టేబుల్ వేధింపులు

- పిహెచ్‌డి విద్యార్థి బలవన్మరణం
- కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు



హైదరాబాద్,ప్రజాభూమి

కానిస్టేబుల్ వేధింపులు భరించలేక పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని వేధించడంతో మనస్తాపానికి గురైన దీప్తి ఉరేసుకుని బలవన్మరణాని పాల్పడింది. ఈ కేసులో సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. నాచారంలోని బాపూజీనగర్ సరస్వతీకాలనీకి చెందిన పులివర్తి దీప్తి(28) హబ్సిగూడలోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దీప్తి తండ్రి సంగీతరావు ఐఐసీటీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. సంగీతరావుకు డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లా అనిల్‌తో పరిచయముంది. సంగీతరావు.. అనిల్ భార్య అనితకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో అనిల్ తన డబ్బు తిరిగివ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో చాలా ఏళ్ల నుంచి కలిసి ఉండడం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం ఠాణాలో ఫిర్యాదు చేయించాడు. దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. నాచారం పోలీసులు అనిత, అనిల్, సోమయ్య, సైదులు మీద కేసు నమోదు చేశారు. 'నా మరణానికి అనిల్, ఆయన భార్య అనిత, ఆమె తండ్రి సోమయ్య కారణం. నాన్న డబ్బు తీసుకుంటే నామీద నకిలీకేసు నమోదు చేయించి జీవితాన్ని నాశనం చేశారు. ఈ కేసుల మీద పోరాడే స్థోమత లేదు. నా మరణంతోనైనా కుటుంబానికి న్యాయం జరుగుతుంది. నా చావుకు కారణమైన వాళ్లకు శిక్షపడాలి. నా మృతదేహాన్ని వైద్య పరిశోధనకు ఇచ్చేయండి' అని కన్నీరు పెట్టుకుంటూ సెల్ఫీ వీడియో చిత్రీకరించింది. దీప్తి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైకుంఠ ద్వార దర్శనాలకు మాత్రమే అనుమతి



తిరుమల,ప్రజాభూమి

జనవరి 10 నుంచి 19వ తేది వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక సూచనలు చేసింది. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించింది. భక్తులకు కేటాయించిన దర్శన తేదీ రోజున మాత్రమే భక్తులు తిరుమల దర్శనానికి రావాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి కోరారు. ఈ మేరకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు.వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలలో చేస్తున్న ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ చేయనున్న 9 కేంద్రాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీ, పాలు, కాఫీ పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా పది రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు, చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ, ఎన్ఆర్ఐ, మొదలైన విశేష దర్శనాలు పది రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. గోవింద మాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండవని, వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా లడ్డూ విక్రయ కేంద్రంలో ప్రతి రోజూ 3.50 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచాలని అన్నారు. చలి తీవ్రతకు భక్తులు ఇబ్బంది పడకుండా విశ్రాంతి గృహాల్లో వేడి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు వేల మంది యువ శ్రీవారి సేవకులు, స్కౌట్ అండ్ గైడ్స్ సేవలను క్యూలైన్ల నిర్వహణకు వినియోగించుకోవాలన్నారు.

## అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబాలకు ఎస్పీ పరామర్శ



ములుగు,ప్రజాభూమి

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతలు బడే చొక్కారావు, కొయ్యాడ సాంబయ్య ఇళ్లను జిల్లా ఎస్పీ శబరీష్ శుక్రవారం సందర్శించారు. తాడ్వాయి మండలం కాల్వపల్లిలో బడే చొక్కారావు ఇంటికి వెళ్లి.. తల్లి బతుకమ్మకు నిత్యావసరాలు అందించారు. గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంలో సాంబయ్య ఇంటికి కూడా వెళ్లారు ఎస్పీ. సాంబయ్య భార్య సుజాతకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. బడే చొక్కారావు, కొయ్యాడ సాంబయ్య అడవి వీడి జనంలోకి రావాలని ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు. చొక్కారావు, సాంబయ్యపై ఉన్న రివార్డులతో పాటు ఇండ్ల మంజూరుకు ములుగు ఎస్పీ హామీ ఇచ్చారు.

## రైలు పట్టాల మీద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



వరంగల్,ప్రజాభూమి

వరంగల్ కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దర్గా రైల్వే గేటు వద్ద 40 ఏండ్ల వ్యక్తి డెడ్ బాడీ లభ్యమైనట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. అయితే శుక్రవారం ఉదయం ఈ మార్గం గుండా వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి.. ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు బ్లూ కలర్ ప్యాంట్, తెలుపు రంగు షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ

- సోమవారానికి వాయిదా వేసిన కోర్టు
- వర్చువల్‌గా పాల్గొన్న బన్నీ



హైదరాబాద్,ప్రజాభూమి

నటుడు అల్లుఅర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద బయట ఉన్న అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు రెండు వారాల జ్యూడీషియల్ రిమాండ్ గడువు సైతం పూర్తి కావడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని నాంపల్లి కోర్టుకు తెలిపారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం అల్లు అర్జున్ తరఫున ఆయన లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. నాంపల్లి కోర్టు ఈ పిటిషన్ విచారణ స్వీకరించింది. కోర్టులో విచారణ ప్రారంభం కాగా, కౌంటర్ ధాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. దాంతో నాంపల్లి కోర్టు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నేరుగా కాకుండా వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. మొదట అల్లు అర్జున్ విచారణకు వస్తారని నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

హైదరాబాద్,ప్రజాభూమి

మంచి మనసున్న నాయకుడుగా పేరున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కూడా అదే విధానాన్ని పాటించారు. ఎప్పటి నుంచో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తెలంగాణలో జరుగుతున్న బలిదానాలు, ఉద్యమాలను చూసిన ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సానుకూలంగా వ్యవహరించారు. జరిగిన ఆరవైఏండ్ల సుదీర్ఘ పోరాటానికి మన్మోహనుడి ప్రభుత్వంలోనే ముగింపు లభించింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనే నెరవేరింది. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ డిసెంబర్ 9 ప్రకటన వెలువడింది. 1971లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని మాట తప్పిన కాంగ్రెస్ తప్పును 2014లో సరి దిద్ది, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. తన ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లును ఉభయ సభల్లో గట్టెక్కించారు. తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆంధ్ర నేతలు, ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీనామా చేస్తామని బెదిరించారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. పార్ల మెంటులో రచ్చజరిగినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించేందుకు మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారన్నారు అప్పటి కేంద్రహోంమంత్రి షిండే అన్నారు. ఇక అధికారం కోల్పోయాక కూడా విభజన సమస్యల పరిష్కారానికి మన్మోహన్ డిమాండ్ చేశారు. విభజన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ఇక, దశాబ్దాల పాటు తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్‌సింగ్ ముందు వరుసలో ఉంటారు. తెలంగాణ ఆకాంక్షలను, రాష్ట్రం ఆవిర్భవించకపోతే జరిగే అనర్థాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పూసగుచ్చినట్టు వివరిస్తే అర్థం చేసుకున్న మనసున్న పాలకుడు మన్మోహన్ సింగ్. త్రిమూర్తుల కూర్పు.. డిసెంబర్ 9 ప్రకటనతెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న చేసిన ప్రకటనను త్రిమూర్తుల కూర్పుగా చెప్పుంటారు. ప్రకటన చేసింది

## విద్యుత్ ఛార్జీలపై వైసీపీ పోరుబాట



అమరావతి,ప్రజాభూమి

కరెంట్ ఛార్జీల పెంపుపై వైసీపీ పోరుబాటను నిర్వహించింది. చంద్రబాబు నాయకత్వం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే భారీగా విద్యుత్ ఛార్జీలు పెంచిందని ఆరోపిస్తు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించింది. రాష్ట్రప్రజలపై రూ. 15 వేల కోట్ల అదనపు భారం మోపిందని ఆరోపించింది. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరిలో మాజీ మంత్రి రోజా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ అన్నట్లుగా చంద్రబాబు పాలన ఉందని విమర్శించారు. ఓటేసిన ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం కాటేస్తుందని ఆరోపించారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసనలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని, ఎన్నికలకు ముందు మాటలకు ఇప్పటి చేతలకు సంబంధం లేదని పేర్కొన్నారు. అమరావతికి లక్ష కోట్లు ఖర్చు చేస్తే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో విద్యుత్ బిల్లులు తగ్గించాలని రైతులు డిమాండ్ చేస్తే వారిపై కాల్పులు జరిపిన ఘనుడు చంద్రబాబు అన్ని ఆరోపించారు

## అల్లు అర్జున్‌పై బచ్చన్ ప్రశంసలు

- ఆయనతో నన్ను పోల్చకండి
- కౌన్‌బనేగా కరోడ్‌పతిలో అమితాబ్ వ్యాఖ్యలు



ముంబై,ప్రజాభూమి

పుష్ప2'తో టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఈ హీరోపై బాలీవుడ్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ మరోసారి ప్రశంసలు కురిపించారు. బన్నీ గొప్ప ప్రతిభావంతుడని పేర్కొన్నారు. 'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో ఓ కంటెస్టెంట్‌తో అల్లు అర్జున్ గురించి బిగ్ బీ మాట్లాడారు. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి'. ప్రస్తుతం దీని 16వ సీజన్ ప్రసారమవుతోంది. దీని తాజా ఎపిసోడ్‌కు కోల్‌కతాకు చెందిన ఓ గృహిణి కంటెస్టెంట్‌గా వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. తనకు అల్లు అర్జున్, అమితాబ్ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. దీనిపై అమితాబ్ స్పందిస్తూ.. 'అల్లు అర్జున్ తనకు వచ్చిన గుర్తింపులన్నిటికీ పూర్తి అర్హుడు. నేను కూడా అతడికి వీరాభిమానిని. ఇటీవల బన్నీ నటించిన 'పుష్ప: ది రూల్' విడుదలై మంచి విజయం సాధించింది. మీరు ఇంకా ఆ సినిమాను చూడకపోతే వెంటనే చూడండి. అతడు గొప్ప ప్రతిభావంతుడు. అతడితో నన్ను పోల్చొద్దు' అంటూ సరదాగా చెప్పారు. దీనికి ఆ కంటెస్టెంట్ స్పందిస్తూ.. 'కొన్ని సన్నివేశాల్లో మీ ఇద్దరి మేనరిజం ఒకేలా ఉంటుంది. ఈ షో వల్ల మిమ్మల్ని కలిశాను. ఏదోఒకరోజు అల్లు అర్జున్‌ను చూస్తే నా కల నెరవేరుతుంది' అని చెప్పారు. ఇక 'పుష్ప 2' ప్రచారంలో భాగంగా ముంబయిలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బన్నీ మాట్లాడుతూ.. అమితాబ్ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన ఎన్నో సంవత్సరాల నుంచి ఇండస్ట్రీలో స్టార్‌గా ఉన్నారని.. ఎంతోమంది నటీనటులకు ఆయన స్ఫూర్తి అని చెప్పారు. అమితాబ్ సినిమాలు చూస్తూ పెరిగానన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకువెళ్తున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో షేర్ చేసిన అమితాబ్.. అల్లు అర్జున్ పనితీరుకు తాను అభిమానినని పోస్ట్ పెట్టారు. ఎన్నో మంచి విజయాలు అందుకోవాలని కోరారు. దీనికి బన్నీ రిప్లై పెడుతూ.. 'మీరు మా సూపర్ హీరో. మీనుంచి ఇలాంటి ప్రశంసలు నమ్మలేకపోతున్నా. నాపై మీకున్న ప్రేమకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

# విద్యుత్ రంగాన్ని దివాళా తీయించిన జగన్

- 30వేలకోట్ల భారం మోపిన మాజీ సిఎం
- ట్రూ అప్ ఛార్జీలపై ఎందుకు మాట్లడడం లేదు
- వైసిపి పాలనపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి,ప్రజాభూమి

తన పాలనలో రాష్ట్ర విద్యుత్ రంగంపై దాదాపు లక్షా 30 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిన జగన్ ఇప్పుడు చిలకపలుకులు పలుకుతున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ పై మంత్రి మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శలు గుప్పించారు. జగన్ విద్యుత్ సమస్యలపై ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. 'యూనిట్ కు ఐదు రూపాయలకు దొరికే విద్యుత్‌ను 8 నుండి 14 రూపాయల వరకు కొనుగోలు చేసి ప్రజలపైన జగన్ రెడ్డి మోయలేని భారాన్ని మోపారని ఆయన మండిపడ్డారు. సోలార్, విండ్ ఎనర్జీ పీపీఎలను రద్దు చేసి, ఏపీకి 10 వేల మెగా వాట్ల పునారుత్పాదక విద్యుత్తును జగన్ అందుబాటులో లేకుండా చేశారని మంత్రి విమర్శించారు. 2022 నుండి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ. 17 వేల కోట్ల ట్రూ అప్ ఛార్జీలను పెంచాలని అనాడే జగన్ సర్కార్ ఆమోదించింది. ఆ ట్రూ అప్ ఛార్జీలనే రెండేళ్ల పాటు పెంచకుండా ప్రస్తుతం డిసెంబర్ నుండి అమలు చేయాలంటూ ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. తాను పెంచాలని సూచించిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా తానే పోరాడం చేయడం పిచ్చి తుగ్లక్ జగన్ కు మాత్రమే చెల్లిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. వీటిగురించి సమాధానం చెప్పకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి మండిపడ్డారు.

# ముంబై ఉగ్రదాడి కుట్రదారు

## - హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ మృతి



లాహోర్,ప్రజాభూమి

ముంబై ఉగ్రదాడి కుట్రదారు, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) డిప్యూటీ చీఫ్ హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ శుక్రవారం పాకిస్థాన్‌లో గుండెపోటుతో మరణించారు. గత కొద్ది రోజులుగా లాహోర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మధుమేహ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ.. శుక్రవారం తెల్లవారుజామున ఆయన తుది శ్వాస విడిచారని జమాత్-ఉద్-దవా అధికారి ధృవీకరించారు. కాగా, 2019 మేలో మక్కీని పాకిస్తాన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. 2020లో పాకిస్తానీ ఉగ్రవాద నిరోధక కోర్టు టెర్రర్ ఫైనాన్సింగ్ కేసుల్లో అతనిని దోషిగా నిర్ధారించడంతో అతనికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది.అలాగే, 26/11 ముంబై టెర్రర్ దాడులకు ఆర్థిక సహాయం అందించడంలో హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ కీలక పాత్ర పోషించారు. దీంతో 2023లో మక్కీని ప్రపంచ ఉగ్రవాదిగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రకటించింది. దీంతో అతడి ఆస్తులను జప్తు చేయడంతో పాటు ఆయన ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. జూడి కార్యకలాపాల ముసుగులో మిలిటెంట్ కార్యకలాపాలకు నిధుల సమీకరణ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు రావడంతోనే ఈ చర్యలు తీసుకుంది.

# మన్మోహన్‌తో విడదీయరాని బంధం

## - ఆనాటి జ్ఞపకాలు గుర్తు చేసుకున్న నేతలు

వరంగల్,ప్రజాభూమి

ఓరుగల్లుతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు అనుబంధం ఉంది. వరంగల్ ఆర్ఈసీలో 1992లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి నాడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ హాజరయ్యారు. కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ జయశంకర్ సారథ్యంలో జరిగిన వేడుకల్లో ఆయన చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన మామునూరుకు రాగా అక్కడి నుంచి ఆర్ఈసీకి చేరుకున్నారు. నాడు రాష్ట్ర మంత్రులుగా పొన్నాల లక్ష్మయ్య, మాదాడి నర్సింహారెడ్డి, జగన్నాయక్, పీవీ రంగారావు, వరంగల్, హనుమకొండ పార్లమెంటు సభ్యులుగా ఆర్.సురేందర్‌రెడ్డి, కమాలుద్దీన్ అహ్మద్, కేయూ పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ బండా ప్రకాశ్ బృందం మన్మోహన్‌సింగ్‌తో వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేదికపైనే ప్రపంచ ధ్వని అనుకరణ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు గౌరవ డాక్టరేట్ అందించారు. తొలిసారిగా ఎంపీగా గెలిచిన తర్వాత తనకు కేంద్రసహాయ మంత్రి రావడంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్ర ఎంతో ఉందని ఎంపి పోరిక బలరామ్ అన్నారు. గిరిజన సామాజిక వర్గం నుంచి ఎన్నికైన తనను మన్మోహన్‌సింగ్ ఎంతో ప్రోత్సహించేవారు. విద్య, వైద్యంతో పాటు పేదలకు ఉపయోగపడే ఏ పని కావాలన్నా తనను అడుగు ఇస్తానంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన ఆయన మృతి చెందారనే విషయం తెలిసి తండ్రిని కోల్పోయినంత బాధగా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన సహకారంతోనే తాడ్వాయి-పస్రా అటవీ రహదారి విస్తరణతోపాటు పలు అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేసుకున్నారు. భారత మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సంతాపాన్ని ప్రకటించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పనిచేసిన సమయంలో తాను అనేకసార్లు కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీలో తాను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా బాబ్లీ ప్రాజెక్టు, నాగర్జునసాగర్ అంశంలో మన్మోహన్‌సింగ్‌ను కలిసి మాట్లాడానని చెప్పారు. మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటని పేర్కొన్నారు.

# వైసిపికి మరో నేత రాజీనామా

## - రాజకీయాల నుంచి తప్పకున్న మాజీ ఐఎఎస్ ఇంతియాజ్



కర్నూలు,ప్రజాభూమి

ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్‌లు తగులుతూ వస్తున్నాయి.. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు.. ప్రజాప్రతినిధులు ఇలా ఎంతో మంది పార్టీని వీడారు.. కూటమి పార్టీలో చేరుతున్నారు.. అయితే, తాజాగా వైసీపీ మరో షాక్ తగిలినట్టు అయ్యింది.. మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ వైసీపీకి రాజీనామా చేశారు.. అలాగే మొత్తం రాజకీయాలకే గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు.. గత ఎన్నికల్లో కర్నూల్ జిల్లా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఇంతియాజ్.. ఓటమి పాలయ్యారు.. అయితే, ఇప్పుడు ఇంతియాజ్ రాజీనామా లేఖ విడుదల చేశారు.. రాజకీయాలకు గుడ్ బై చెప్పాలని నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు.. కొన్ని నెలల క్రితం ప్రజాసేవే ధ్యేయంగా, ముఖ్యంగా కర్నూలు నగరంలో ఉన్న పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐఏఎస్ సర్వీస్ నుండి వీఆర్ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి రావడం జరిగింది. కర్నూలు నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం, ఎన్నికల ఫలితాలు మీ అందరికీ తెలిసిందే.. గత కొంత కాలంగా బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులతో చర్చించ ఒక నిర్ణయానికి రావడం జరిగింది.. అదేమిటంటే.. రాజకీయ రంగం నుడి దూరంగా జరగటం.. రాజకీయాలకు దూరం అవుతున్నాను.. కానీ ప్రజసేవ రంగానికి కాదు‘ అని పేర్కొన్నారు..ఇక, ‘ఇప్పుడు ఒక రిటైర్డ్ ఏఐఎస్ అధికారిగా, సామాజిక సృహ కలిగిన వ్యక్తిగా మరియు సాహితీవేత్తగా ఒక మెరుగైన సమాజం కోసం, నా వంతు కృషి చేయటానికి సిద్ధంగా ఉన్నాను.. గత ఆరు నెలల కాలంలో నాకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి.. ముఖ్యంగా కర్నూలు నగర వాసులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.. రాబోయే రోజుల్లో సామాజిక అసమానతలను, రుగ్మతులను రూపుమాసేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు ఆ దిశగా పని చేసే స్వచ్ఛంద సంస్థలతో, వ్యక్తులతో పని చేయాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది..‘ అంటూ ఆ లేఖలో ఇంతియాజ్ పేర్కొన్నారు..

# నాటి పాపాలు నేటికీ వెంటాడుతూనే ఉన్నాయ్

## - మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రకాశం, ప్రజాభూమి

నాడు ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని మంత్రి బాల వీరాంజనేయ స్వామి విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రజలపై నాడు విద్యుత్ భారాలు మోపి నేడు ఏమీ ఎరుగనట్టు ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాను పెంచిన చార్జీలపై తన పార్టీ శ్రేణులతోనే ధర్నాలు చేయించడం సైకో చర్య. ఏపీఈఆర్సీ అనుమతించిన దాని కన్నా రూ.19 వేల కోట్లు అదనంగా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. యూనిట్ రూ.5 లకే వచ్చే విద్యుత్‌ను కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.14 కు కొనుగోలు చేసింది జగన్ కాదా అని నిలదీశారు. జగన్ తన అవినీతిని ప్రజలపై సర్దుబాటు ఛార్జీల రూపంలో భారం మోపేందుకు నాడే ఏపీఈఆర్సీ అనుమతి కోరింది వాస్తవం కాదా అని అడిగారు. జగన్ అవినీతి, ధన దాహం వల్లే ప్రజలపై విద్యుత్ భారం పడిందన్నారు. ఇవ్వన్నీ తెలిసి కూడా దొంగే దొంగ అన్నట్టు జగన్ తీరు ఉందంటూ విమర్శలు గుప్పించారు. పవర్ చార్జీలు పెంచినందుకే జగన్‌కు ప్రజలు పవర్ పీకేశారన్న విషయం జగన్ తెలుసుకోవాల్నారు.. జగన్ ఇకనైనా ప్రజలను మోసం చేయడం మానుకొని వాస్తవాలు గ్రహించాలని మంత్రి బాల వీరాంజనేయ స్వామి హితవుపలికారు. జగన్‌ది తుగ్లక్ చర్యే: మంత్రి గొట్టిపాటి కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన జగన్ రెడ్డి హయాంలోనే జరిగిందని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే చార్జీలను పెంచాలని డిస్కంలు ఈఆర్సీని కోరాయన్నారు. 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన వైసీపీకి ధర్నా చేసే నైతిక హక్కు లేదని అన్నారు. జగన్ విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రతిపాదించి.. నేడు వాటిపై ధర్నాలు చేయడం తుగ్లక్ చర్య అంటూ



మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు గుప్పించారు.

### వైసీపీ నిరసనలు...

కాగా.. కరెంట్ చార్జీల పెంపునకు నిరసగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పోరుబాటకు దిగింది. విశాఖపట్నంలోని గురుద్వార్ జంక్షన్ నుంచి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వరకు వైసీపీ నేతల పాదయాత్ర చేపట్టారు. మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్, వైసీపీ నేతలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీ నిరసన ర్యాలీలు చేపట్టింది. పులివెందుల్లో ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వైసీపీ నేతలు ర్యాలీలు నిర్వహించారు.

# మన్మోహన్ హయాంలో చారిత్రక నిర్ణయాలు

## - సమాచారహక్కు చట్టం...ఉపాధి హామీ
## - విశిష్ట గుర్తింపు కార్డు ఆధార్‌కు శ్రీకారం

న్యూఢిల్లీ,ప్రజాభూమి

మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై చెరగని ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. ప్రధానిగా పదేళ్లు సేవలందించిన ఆయన దేశ చరిత్రలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు.2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. మన్మోహన్ సింగ్ పాలనాకాలంలోనే దేశంలో 3జీ, 4జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునేలా నిబంధనలు రూపొందించింది. సామాన్యుడి చేతికి పాశుపత్రాస్త్రంలాంటి సమాచార హక్కును అందించింది. దేశంలో 3 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికే దక్కుతుంది. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో




చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

# ఏడు నెలలుగా చంద్రబాబు ప్రజలకు షాక్

## - సూపర్ సిక్స్ కాదు.. సూపర్ షాక్ అన్నట్లుగా పాలన
## - విద్యుత్ పోరుబాటకు భారీగా జనస్పందన
## - మాజీమంత్రి కన్నబాబు వెల్లడి

కాకినాడ,ప్రజాభూమి

గత ఏడు నెలలుగా చంద్రబాబు ప్రజలకు షాక్ ఇస్తున్నారని.. ఆరోగ్యశ్రీ ఉందా? లేదా? అనే పరిస్థితికి తీసుకువచ్చారంటూ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్సులిన్ కూడా లేని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారని.. కొందర్ని తొలగించారని కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ కాదు.. సూపర్ షాక్ అన్నట్లుగా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. భుజాలపై మోసే సొంత మీడియా ఉండడమే చంద్రబాబు అదృష్టం. పేరులో ఉచితం తప్పా.. ఉచిత ఇసుక ఎక్కడా?. చంద్రబాబుకు ఇస్తున్న షాకులకు ఎవరూ మినహాయింపు కాదు. బాబు వస్తే తమకు స్వర్గం అనుకున్న మద్యం ప్రియులకు కూడా షాక్ ఇచ్చారు‘ అని కన్నబాబు దుయ్యబట్టారు. ‘ఉత్తరాంధ్ర నుండి రాయలసీమ వరకు ఇవాళ వైఎస్సార్‌సీపీ పోరుబాట దిగ్విజయంగా జరిగింది. విద్యుత్ భారం, మూడు డిమాండ్లను అధికారులకు వినతిపత్రం ద్వారా అందించాం. ఒక్క



నెలలోనే ఆరు వేల కోట్లు విద్యుత్ ఛార్జీల రూపంలో వసూలు చేసే కార్యక్రమం జరుగుతుంది. ఇంకా ఎంత కాలం జగన్ నామ స్మరణం చేస్తారని చంద్రబాబును ప్రశ్నిస్తున్నాను. పచ్చి అబద్దాలను కూటమి ప్రభుత్వం మానిఫెస్టోలో పెట్టింది. చంద్రబాబు సర్కార్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరు ఆపదు.‘ అని కన్నబాబు స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ అంటే వైఎస్సార్ గుర్తుకు వస్తారు. తొమ్మిది గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది. రైతుల ఉచిత విద్యుత్ కోసం ఫీడర్లను ఆధునీకరించారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం, చంద్రబాబు పట్ల ప్రజల ఆగ్రహం బయటకు వచ్చింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హమీలను అమలు చేయాలి’ అని చంద్రబాబు సర్కార్‌ను కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.

# ఫలించిన తెలంగాణ నేతల ఒత్తిడి

## - సిఫార్స్ లేఖలు ఆమోదస్తామన్న టిటిటి
## - వారంలో రెండురోజులు మాత్రమేనంటూ మెలిక

తిరుమల,ప్రజాభూమి

తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు శుభవార్త చెప్పింది. వారానికి రెండు సార్లు తెలంగాణ నేతల సిఫార్సు లేఖలు అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు తీసుకోవడం లేదనే ప్రశ్నపై టీటీడీ ఈవో శ్యామల రావు గతంలో స్పందించారు. శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతి స్తున్నామని స్పష్టత ఇచ్చారు. తెలంగాణ నుంచి సిఫార్సు లేఖలు తీసుకువస్తే.. చెల్లుబాటు కావని స్పష్టమైంది. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానంలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పలు ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి.దీంతో తాజాగా టీటీడీ బోర్డు తెలంగాణ



ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని పునఃపరిశీలించింది. మిత్ర, సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరి కాద నుకుంది. బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దీంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు వారానికి రెండు సార్లు అనుమతిస్తారు.

# విద్యుత్ ఛార్జీలపై వైసిపి వీధి పోరాటం

- రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన
- ర్యాలీలు, ధర్నాలతో నిరసన ధ్వని
- కూటమి ప్రభుత్వం హామీని మరచిందని విమర్శలు
- సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్‌లపై రోజా రుసరుస



అమరావతి,ప్రజాభూమి

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది.. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, బైక్ ర్యాలీలు.. ఇలా పలు రకాలుగా ఆందోళన నిర్వహించారు.. ఊరూవాడ అధికార కూటమిపై విమర్శలు గుప్పిస్తూ ఆందోళనకు దిగారు. పలుచోట్ల ధర్నాలు రాస్తా రోకోలు నిర్వహించారు. పార్టీ ముఖ్య నేతలు ఆందోళనల్లో పాల్గొన్నారు. విద్యుతు ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి, పెంచడంపై నేతలు మండిపడ్డారు. ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ ఛార్జీలు అంటూ ప్లకార్డులతో నిరసలను తెలిపారు. ఎక్కడిక్కడ ప్రజలు భారీ సంఖ్యలో వైసిపి ఆందోళనలో పాల్గొన్నారు. విద్యుత్ ఛార్జీలపై ఇచ్చిన మాట కూడా మరిచిపోయి ఆరు నెలల్లోనే రూ.15,485.36 కోట్ల బాదుడుకు తెర తీశారు. వాటిలో ఇప్పటికే నవంబరు బిల్లులో రూ.6 వేల కోట్లు వేయగా, వచ్చే నెల నుంచి మరో రూ.9,412 కోట్ల బాదుడుకు సిద్ధమయ్యారు. అలా ప్రజల నడ్డి విరుస్తున్నారు. దీంతో విద్యుత్ గృహ వినియోగదారులపై 25 నుంచి 55 శాతం వరకు అదనపు వడ్డన చేస్తున్నారు. ఎంత దారుణం అంటే.. ఇది శీతాకాలం. అంటే విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడే ఇంత భారం మోపితే, ఇక వేసవి కాలంలో విద్యుత్ వాడకంపై ఎంత భారం పడుతుందో అర్థం కావడం లేదు. ఆనాడు జగన్ ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకూ ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను దూరం చేసింది. బిల్లులు చెల్లించాల్సిందే నంటూ వారిని వేధిస్తోంది. ఇప్పుడు తాజాగా అన్ని వర్గాలపైనే విద్యుత్ ఛార్జీల కొరడాను ఝుళిపిస్తోంది లో ప్రస్తుతం దాదాపు 195 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయలేక రాష్ట్రవ్యాప్తంగా సగటున 2 నుంచి 3 గంటల పాటు కోత విధిస్తున్నారు. వాడకం ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అనధికారికంగా కోతలు అమలు చేస్తున్నారు. అయినా అధికారిక నివేదికల్లో విద్యువిత్ లోటు, కోతలు లేవంటూ బుకాయిస్తువిన్నారు. నిజానికి గతేడాది కంటే విద్యుత్ డిమాండ్ 1.17 శాతం తక్కువగా ఉన్నా, అది కూడా సరఫరా చేయలేక ప్రభుత్వం సన్నాయినొక్కులు నొక్కుతోంది. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిండు వేసవిలోనూ, బొగ్గు సరఫరా సంక్షోభంలోనూ ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని నేతలు వివరించారు. తిరుపతి జిల్లాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత ఆర్కే రోజా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విరుచుకుపడ్డారు.. ఎన్నికల హామీలను చంద్రబాబు మర్చిపోయారని దుయ్యబట్టారు.. ఇక, విద్యుత్ ఛార్జీలపై పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ఏమైందని అంటూ నిలదీశారు.. అసలు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ పోతుంటూ.. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ అసలు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని నిలదీశారు.. ఏదేమైనా పెంచిన ఛార్జీలు తగ్గించేవరకు పోరాటం ఆగదని మాజీ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు.. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచం.. వీలైతే తగ్గిస్తాం.. అంతేకాదు.. ప్రజల దగ్గర నుంచే విద్యుత్ కొనుగోలు చేస్తామని చంద్రబాబు మాట్లాడారు.. కానీ, నేడు కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన భారంతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, విద్యుత్ ఛార్జీలు పెంచం.. పెంచితే ఒప్పుకోమన్న పవన్ కల్యాణ్.. ఈ రోజు ఎందుకు ఆపలేకపోతున్నారు.. ఎందుకు సీఎంను నిలదీయలేకపోతున్నారని మండిపడ్డారు రోజా.. ఇక, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి ఆర్కే రోజా చేసిన సంచలన వ్యాఖ్యలు చేశారు.

## మద్యం మత్తులో బైక్ ప్రమాదం

- ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి



హైదరాబాద్,ప్రజాభూమి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందారు. ఈ ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోరబండకు చెందిన ఆకాన్ష్, రఘుబాబు అర్ధరాత్రి సమయంలో బోరబండ నుంచి మాదాపూర్ వెళుతుండగా.. మాదాపూర్ 100 ఫీట్ రోడ్‌లోని పర్వత్ నగర్ చౌరస్తా సమీపంలో బుల్లెట్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలోనే ఒకరు మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందినట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు. బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి పడ్డ బస్సు: 8మంది మృతి



చండీగఢ్,ప్రజాభూమి

పంజాబ్‌లో ఓ బస్సు బ్రిడ్జిపై నుండి పడిపోయింది. ఈ ప్రమాదంలో 8మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని భటిండాలో శుక్రవారం ఈ ఘటన జరిగింది.బస్సు తల్వాండి సాబో నుండి భటిండాకు బయలు దేరింది. భారీ వర్షం కారణంగా ప్రమాదవశాత్తు బస్సు బ్రిడ్జిపై నుండి కాల్వలోకి పడిపోయింది.

ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నా రు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్లు సీనియర్ పోలీసులు తెలిపారు.

## అవినీతి వ్యతిరేక చర్యలపై వేగంగా స్పందించారు

- సమాజ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు
- మన్మోహన్ మృతికి సంతాపం ప్రకటించన అన్నా హజారే



రాలేగావ్ సిద్ధి,ప్రజాభూమి

మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ మృతికి ప్రముఖ సామాజిక కార్యకర్త, అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే సంతాపం తెలిపారు. ఆయన అవినీతికి వ్యతిరేకి అని, లోక్‌పాల్, ఇతర అవినీతి వ్యతిరేక చర్యల కు వేగంగా చర్యలు తీసుకున్న నేత అని కొనియాడారు. మహారాష్ట్రలో తన స్వగ్రా మమైన రాలేగావ్ సిద్ధిలో జాతీ య వార్తా సంస్థతో హజారే మాట్లాడుతూ, పుట్టినవారికి మరణం తప్పదని, అయితే కొన్ని జ్ఞాపకాలు, వారసత్వం మాత్రం మిగిలి పోతాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు డాక్టర్ మన్మోహన్ సింగ్ కొత్త దిశను చూపించారని, దేశం, సమాజ సంక్షేమానికి సింగ్ ప్రాధాన్యతనిచ్చే వారని అన్నారు. లోక్‌పాక్ నిరసనలను చేపట్టిన సమ యంలో తనను మన్మోహన్ చర్చలకు ఆహ్వానించారని, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేవారని అన్నా హజారే గుర్తు చేసుకున్నారు. 'ఆయన అవినీతికి వ్యతిరేకం. లోక్‌పాల్, లోకాయుక్త చట్టాలకు సంబంధించి వెంటనే నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన ఎప్పుడు దేశం గురించి, ప్రజలకు ఎంత మెరుగైన సేవలందించాలనే విషయం గురించే ఆయన నిరంతరం ఆలోచించే వారు' అని హజారే పేర్కొ న్నారు. భౌతికంగా మన్మోహన్ ఈలోకాన్ని విడిచి పెట్టిన ప్పుడు, ప్రజల మనసుల్లో ఎప్పటికీ జ్ఞాపకం ఉంటారని అన్నారు.

## మన్మోహన్‌తో విడదీయరాని బంధం

- ఆనాటి జ్ఞపకాలు గుర్తు చేసుకున్న నేతలు

వరంగల్,ప్రజాభూమి:



ఓరుగల్లుతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు అనుబంధం ఉంది. వరంగల్ ఆర్ఈసీలో 1992లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి నాడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి హోదాలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ హాజరయ్యారు. కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ జయశంకర్ సారథ్యంలో జరిగిన వేడుకల్లో ఆయన చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన మామునూరుకు రాగా అక్కడి నుంచి ఆర్ఈసీకి చేరుకున్నారు. నాడు రాష్ట్ర మంత్రులుగా పొన్నాల లక్ష్మయ్య, మాదాడి నర్సింహారెడ్డి, జగన్నాయక్, పీవీ రంగారావు, వరంగల్, హనుమకొండ పార్లమెంటు సభ్యులుగా ఆర్.సురేందర్ రెడ్డి, కమాలుద్దీన్ అహ్మద్, కేయూ పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ బండా ప్రకాశ్ బృందం మన్మోహన్‌సింగ్‌తో వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేదికపైనే ప్రపంచ ధ్వని అనుకరణ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు గౌరవ డాక్టరేట్ అందించారు. తొలిసారిగా ఎంపీగా గెలిచిన తర్వాత తనకు కేంద్రసహాయ మంత్రి రావడంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్ర ఎంతో ఉందని ఎంపి పోరిక బలరామ్ అన్నారు. గిరిజన సామాజిక వర్గం నుంచి ఎన్నికైన తనను మన్మోహన్‌సింగ్ ఎంతో ప్రోత్సహించేవారు. విద్య, వైద్యంతో పాటు పేదలకు ఉపయోగపడే ఏ పని కావాలన్నా తనను అడుగు ఇస్తానంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన ఆయన మృతి చెందారనే విషయం తెలిసి తండ్రిని కోల్పోయినంత బాధగా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన సహకారంతోనే తాడ్వాయి-పస్రా అటవీ రహదారి విస్తరణతోపాటు పలు అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేసుకున్నారు. భారత మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని రాష్ట్ర మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సంతాపాన్ని ప్రకటించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పనిచేసిన సమయంలో తాను అనేకసార్లు కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీలో తాను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా బాబ్లీ ప్రాజెక్టు, నాగర్జునసాగర్ అంశంలో మన్మోహన్‌సింగ్‌ను కలిసి మాట్లాడానని చెప్పారు. మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటని పేర్కొన్నారు.

## మన్మోహన్ గొప్ప ఆర్థిక వేత్త

- ఆయన మరణం తీరని లోటు: జగన్



పులివెందుల,ప్రజాభూమి

మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం పులివెందులలోని తన నివాసంలో జగన్ మాట్లాడుతూ పదేళ్లపాటు దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ గొప్ప సేవలందించారని ప్రశంసించారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆర్బీఐ గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్కరణల తో దేశ పురోభివఅద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం చైర్మన్ గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ చైర్మన్ గా ఇలా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గొప్ప మేధావి అని కొనియాడారు. ఏ బాధ్యత నిర్వహించినా ప్రతి చోటా తనదైన ముద్ర కనబరిచారని గుర్తు చేశారు. ఆయన దార్శనికత ఎప్పటికీ ఆదర్శప్రాయమని అన్నారు. మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందని చెప్పారు.

## పేర్ని జయసుధ బెయిల్‌పై ముగిసిన వాదనలు



మచిలీపట్నం,ప్రజాభూమి

మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదన లు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి ఈనెల 30న బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులు ఇవ్వనున్నారు. పేర్ని నాని తన సతీమణి పేరుతో పౌరసరఫరాల సంస్థకు మచిలీపట్నంలో గోదాము అదదెకిచ్చారు. ఇందులో నిల్వ ఉంచిన 3,708 బస్తాల రేషన్ బియ్యం మాయ మవ డంతో పౌరసరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయసుధతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజపై మచిలీపట్నం తాలూకా స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు జయసుధ మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె తరపున సీనియర్ న్యాయవాది వరదరాజులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లంకే వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

## లోన్ డబ్బుల కోసం యువతికి వేధింపులు

- ఇద్దరు రికవరీ ఏజెంట్ల అరెస్ట్



తిరుపతి,ప్రజాభూమి

సూళ్లూరుపేటలో లోన్ డబ్బులు కట్టాలని యువతిని వేధింపులకు గురి చేసిన ఇద్దరు రికవరీ ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మీడియాకు వివరించారు. సూళ్లూరుపేటకు చెందిన యువతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆరు నెలల క్రితం ఆమె ఫినబుల్ యాప్‌లో లోన్ తీసుకున్నట్టు తెలిపింది. సమయానికి ఈఎంఐ చెల్లించకపోవడంతో తన ఫొటోలను అసభ్యకరంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని రికవరీ ఏజెంట్లు బెదిరించారు. బాధితురాలి తల్లిదండ్రులు, బంధువులకు ఫోన్ చేసి డబ్బులు కట్టలేదని దూషించారు. అంతటితో ఆగకుండా ఆమె సోదరుడికి కొన్ని న్యూడ్ ఫొటోలు కూడా పంపించారు. ఏజెంట్ల వేధింపులు తాళలేక యువతి పోలీసులను ఆశ్రయించింది. స్పందించిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నాన్ బ్యాంకింగ్ ÷నాన్స్ కంపెనీల వద్ద రుణాలు తీసుకొనే సమయంలో జాగ్రత్త అవసరమని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫినబుల్ లోన్ యాప్‌పై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేశామన్నారు.

## తిరుమలలో తెలంగాణ పట్ల నిర్లక్ష్యం

- మంత్రుల సిఫార్సుల బేఖాతర్
- అప్పట్లో పొరపాటున శ్రీశైలం కోల్పోయాం
- మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



శ్రీశైలం,ప్రజాభూమి

తిరుమలలో తెలంగాణ భక్తులు జరుగుతున్న అసౌకర్యం, అవమానాలపైతెలంగాణ మంత్రి కొండ సురేఖ తిరుమల దర్శనంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు తిరుమలలో తెలంగాణ భక్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని విమర్శించారు. శ్రీశైలం భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామిని ఆమె శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో తెలంగాణ భక్తులకు జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సు లేఖలను టీటీడీ స్వీకరించడం లేదని ఆరోపించారు. తెలంగాణ భక్తుల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మంతనాలు జరుపుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడగా సీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు. టీటీడీ తెలంగాణ భక్తుల మీద ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అప్పట్లో తమ దురదృష్టం వల్ల శ్రీశైలాన్ని కోల్పోయి ఆంధ్రాకు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు.తెలంగాణ నుంచి టీటీడీకి అధిక రాబడి వస్తోందని , టీటీడీ తెలంగాణలో ధర్మప్రచారానికి నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణలో దేవాలయాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి టీటీడీ సహకరించాలని మంత్రి కోరారు.

## మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం



అమరావతి,ప్రజాభూమి

మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌జీ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక రాజనీతిజ్ఞుడని కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల నుంచి ప్రధానమంత్రిగా ఎదిగి దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని అన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. ఆయన కుటుంబానికి, ఆత్మీయులకు, అభిమానులకు సానుభూతి తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విచారం వ్యక్తం చేశారు. అతని దూరదృష్టి విధానాలు, ఆర్థిక సంస్కరణలు భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదగడానికి పునాది వేసిందని జగన్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం అత్యంత బాధాకరమని షర్మిల అన్నారు. భారత దేశ ఆర్థికశిల్పి మరణం దేశానికి తీరని లోటని వివరించారు. రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా, అంతకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, మన దేశానికి అందించిన సేవలు అమూల్యమని అన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలకు మంచిరోజులు

- టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి



గుంటూరు,ప్రజాభూమి

ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలకు మంచి రోజులు వచ్చాయని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో గుడిని గుడిలో లింగాన్ని సైతం మింగేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు తిరుమల స్వామివారి దేవస్థానంలో పరకామణి చోరీ సంఘటన నిదర్శనమని భాను ప్రకాశ్ ఆరోపించారు. భక్తులు సమర్పించే కానుకలను పరకామణి నుంచి దొంగిలించిన వ్యక్తితో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు పెద్దలు టీటీడీకి చెందిన వందల కోట్ల రూపాయలతో జేబులు నింపుకున్నారని భాను ప్రకాశ్ ధ్వజమెత్తారు. తిరుమలలో దోపిడీపై విచారణ కోసం ఏపీ డీజీపీని కలవబోతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం దేవాలయాల వ్యవస్థని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేవాలయాలు, విగ్రహాలపై దాడులు పెరిగాయని ఆయన మండిపడ్డారు. పలు ఆలయాలకు చెందిన రథాలను సైతం కాల్చివేసిన ఘటనలు వెలుగు చూశాయని భాను ప్రకాశ్ ధ్వజమెత్తారు. తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని ఆయన చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ నిధులను దారి మళ్లించే ప్రయత్నం చేశారని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఏపీలో ఏ దేవాలయం నుంచి కూడా ఒక్క రూపాయి నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించకూడదని ఆయన డిమాండ్ చేశారు. మన హిందూ ఆలయాలను మనమే కాపాడుకోవాలని భాను పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి విజయవాడలో జనవరి 5న జరిగే శంఖారావం కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణకు తీర్మానం చేయనున్నట్లు భాను ప్రకాశ్ వెల్లడించారు.

# విద్యుత్‌పై నాలుక మడతేసిన చంద్రబాబు

- ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- వైకాపా ఆందోళనలో విమర్శలు గుప్పించిన అంబటి



గుంటూరు,ప్రజాభూమి

మేం వస్తే..విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం...కరెంట్ సక్రమంగా ఇస్తామన్న బాబు ఇప్పుడు మాటమార్చి ప్రజలపై భారం మోపుతున్నారని మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా వైసీపీ ఏపీ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం గుంటూరులో నిర్వహించిన వైసీపీ నిరసన కార్యక్రమంలో మాజీమంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 'తమ్ముళ్లు మీరు మాకు ఓటు వేయండి విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. తగ్గించడం సంగతి దేవుడు ఎరుగు, చార్జీల మోత మోగుతుంది. వైసీపీకి 11 సీట్లు అనుకోవద్దు, సంబర పడవద్దు.. 40 శాతం ఓట్లు ఉన్నాయి అన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తుపెట్టుకోవాలని ఆయన అన్నారు. సిఎంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడు అన్ని ఇచ్చిన జగన్మోహన్ రెడ్డిని కాదని, కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారని, ప్రజల తరఫున పోరాడితే, వైసీపీ నాయకులు పై సోషల్ మీడియా పేరుతో కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కూడా టోల్ చార్జీలు వసూలు చేయాలని చూస్తుందని, ఆ విషయాన్ని నిలదీస్తే తప్పా? అని ఆయన ప్రశ్నించారు. నాతో సహా ,వైసీపీ సీనియర్ నాయకులు, అందరి మీద కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడి రాజకీయాలు చేసేవాళ్లం కాదన్నారు. విద్యుత్ చార్జీలతోపాటు, ప్రజా వ్యతిరేక, పరిపాలనపై వైసీపీ పోరాడుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వరి ధాన్యానికి బస్తాకు కనీసంరూ. 1740 గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా గిట్టుబాటు ధరకు కొనలేదని, 1300కు, 1400కు బేరాలు ఆడి మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారన్నారు. అయినా ప్రభుత్వానికి పట్టడం లేదని అంబటి తీవ్రంగా ఆరోపించారు.

# ప్రతి కుటుంబం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- పథకంతో ఆర్థిక స్వావలంబనతో పాటు పర్యావరణానికీ మేలు
- కరెంటు బిల్లుల భారానికి పూర్తిస్థాయిలో చెక్ పెట్టేందుకు వీలు
- మిగులు విద్యుత్ ద్వారా ఆదాయాన్నీ ఆర్జించవచ్చు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ,ప్రజాభూమి

భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పీఎం సూర్యఘర్ పథకంతో లబ్ధి పొందుతున్న విశ్రాంత ఆర్ అండ్ బీ ఇంజనీర్ ఏఆర్ఎస్‌పీ ప్రసాద్ ఇంటిని సందర్శించారు. సూర్యఘర్ పథకం ద్వారా ఆయన ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసుకోకముందు, ప్రస్తుతం వస్తున్న కరెంటు బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి తద్వారా ఆరోగ్యకర జీవితానికి మేలుచేసే పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా ప్రతిఒక్కరూ వెళ్లి, సౌర విద్యుత్‌ను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి సూర్య ఘర్ పథకంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఈ పథకం 2024, ఫిబ్రవరి 15న ప్రారంభమైందని.. ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఏఆర్ఎస్‌పీ ప్రసాద్ ఇంటికి గతంలో దాదాపు మూడు వేల వరకు కరెంటు బిల్లు వచ్చేదని.. ఇప్పుడు పూర్తిగా జీరో బిల్లు వస్తోందని.. తాజా బిల్లును చూస్తే తన అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడంతో రూ. 325 ప్రభుత్వం నుంచి తిరిగి పొందే అవకాశం వచ్చిందన్నారు. పథకం వల్ల ఏ మేరకు ప్రయోజనాలు ఉన్నాయో ఈ సంఘటన ద్వారా తెలుసుకోవచ్చని.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు కూడా సోలార్‌రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సొంత ఇల్లు ఉండి, కరెంట్ కనెక్షన్ ఉన్నవారెవరైనా లిలిలి.÷ౌపబబీసాజీణరజీస.ణనీల.తిని ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ. 78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ. 20 వేలు లబ్ధిదారు వాటాపోను మిగిలిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా అయిదు నెలల కిందట 3 కేవీ సామర్థ్యమున్న సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నానని.. దీంతో చాలా ప్రయోజనం పొందుతున్నానని పథకం లబ్ధిదారు, విశ్రాంత ఇంజనీర్ ఏఆర్ఎస్‌పీ ప్రసాద్ తెలిపారు. రూ. 78 వేల రాయితీ లభించిందని.. ఈ పథకం చాలా ఆనందాన్నిస్తోందని.. ఇది చాలా మంచి పథకమని అన్నారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల తిరిగి ఆదాయం వస్తోందన్నారు. మరో ఇద్దరికి ఈ సౌర విద్యుత్ వ్యవస్థ పెట్టించానని.. సామాజిక బాధ్యతగా మరో పది మంది పథకం ద్వారా ప్రయోజనం పొందేలా ప్రోత్సహించనున్నట్లు వివరించారు.గుంటుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి.. అక్కడి కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తికోసమే పర్లయ్య హత్య


- కేసును ఛేదించిన పశ్చిమ పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నయీం అస్మీ



ఏలూరు,ప్రజాభూమి

పశ్చిమ గోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన చెక్కపెట్టెలో మృతదేహం కేసు పోలీసులు ఛేదించారు. ఆస్తికోసమే పర్లయ్యను హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయిందని ఎస్పీ నయీం అస్మీ తెలిపారు. ఈనెల 19న సమాచారం రాగానే ఉండి మండలం యండగండిలోని ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తు మొదలుపెట్టామన్నారు. ఈ కేసులో శ్రీధర్ వర్మ, అతడి రెండో భార్య రేవతి, ప్రియురాలు సుష్మ పాత్ర ఉన్నట్లు తేల్చామని చెప్పారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. 'మృతదేహం ఎలా వచ్చిందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించాం. రంగరాజు కుమార్తెలు తులసి, రేవతి మధ్య గొడవలు ఉన్నాయి. రేవతికి 2016లో శ్రీధర్ వర్మతో వివాహం జరిగింది. తులసిని భర్త వదిలేయడంతో పుట్టింటికి వచ్చి ఉంటోంది. రంగరాజుకి 2.5 ఎకరాల పొలం, కొంత స్థలం, బంగారం ఉన్నాయి. రంగరాజు ఆస్తి కోసం కుట్ర పన్నిన వర్మ.. తులసి అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఈ కుట్రలో ఇరికించాలని చూశాడు. క్షత్రియ సేవా సమితి పేరిట తులసి ఇంటి నిర్మాణానికి సహకరిస్తున్నట్లు కొన్నాళ్లు వర్మ, రేవతి నాటకమాడారు.ఈ క్రమంలో కొన్ని రకాల వస్తువులను శ్రీధర్‌వర్మ పంపారు. డిసెంబర్ 19న పర్లయ్య మృతదేహం పంపించారు. డెడ్ బాడీతో తులసిని భయపెట్టి.. ఆస్తి జోలికి రాకుండా చేయడమే లక్ష్యంగా వర్మ ఈ పన్నాగం పన్నాడు. పర్లయ్యను పట్టించుకునే వారు లేకపోవడంతో ఆయనను చంపేశారు. సుష్మకి చెందిన పొలంలో హత్య చేశారు. తాగి ఉన్న సమయంలో నైలాన్ తాడుతో కట్టి చంపారు. పర్లయ్యకు ముందు మరో వ్యక్తిని చంపాలని వర్మ ప్లాన్ చేశాడు. చెక్కపెటటె పార్సిల్‌లో మృతదేహం ఇంటికి రావడంతో తులసి తొలుత భయభ్రాంతులకు గురైనా.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఎక్కడి నుంచి వచ్చిందన్న కోణంలో విచారించగా అసలు నిందితుడు శ్రీధర్ వర్మ పాత్ర బయటపడింది. నిందితుడిని మచిలీపట్నం సమీపంలో అరెస్టు చేశాం. మామ ఆస్తి, అందులో తులసికి చెందాల్సిన వాటాపై కన్నేసి ఈ పథకం రచించినట్లు విచారణలో వర్మ తెలిపాడు. అతడిని ఏం చేసినా అడిగే వారు ఉండరనే తమ కుట్రలో పావుగా వాడుకుని బలిచేశారు. జూన్ నుంచి ఈ కేసుకు కుట్ర పన్నారు 100 మంది పోలీసు సిబ్బంది ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్నారు‘ అని ఎస్పీ వివరించారు.

# నిమ్స్‌లో ఓపీ సేవలు బంద్




హైదరాబాద్, ప్రజాభూమి

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి దేశమంతా నివాళులర్పిస్తోంది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి కూడా మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించింది. అయితే మాజీ ప్రధాని మృతికి నివాళిగా శుక్రవారం ఓపీ(ఔట్ పేషెంట్) సేవలను నిలిపివేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప ప్రకటించారు. కేవలం ఎమర్జెన్సీ, క్యాజువలిటీ సర్వీసులు మాత్రమే పని చేస్తాయని పేర్కొన్నారు. ఓపీ సాధారణ సేవలు డిసెంబర్ 28 నుంచి అందుబాటులోకి వస్తాయని డాక్టర్ బీరప్ప స్పష్టం చేశారు. ఓపీ సేవలను ఆకస్మికంగా నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము ఎక్కడ చూపించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్లు ఎలాంటి ప్రకటన చేయకపోవడం, ఇక్కడికి వచ్చాక సేవలు నిలిపివేసినట్లు తెలియడంతో రోగులు, వారి అటెండర్లు నిమ్స్ డాక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చేజేతులా తన వికెట్‌ను పారేసుకున్న యశస్వి జైస్వాల్



టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(118 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 82) ఘోర తప్పిదం చేశాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో అసాధారణ బ్యాటింగ్‌తో సెంచరీ దిశగా సాగిన యశస్వి జైస్వాల్.. చేజేతులా తన వికెట్‌ను పారేసుకున్నాడు. లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌటయ్యాడు. భారత తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ వేసిన 41వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఐదో బంతిని బౌండరీ తరలించిన యశస్వి జైస్వాల్.. మరుసటి బంతిని మిడాన్ దిశగా ఆడి క్విక్ సింగిల్‌కు ప్రయత్నం చేశాడు. కానీ ఆ బంతి నేరుగా కమిన్స్ చేతులోకి వెళ్లడంతో కోహ్లీ సింగిల్‌కు ప్రయత్నించలేదు. బంతిని అందుకున్న కమిన్స్ వికెట్లను కొట్టగా.. మిస్సైంది. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ బంతిని అందకొని స్టంప్స్‌ను పడేసాడు. మరోవైపు జైస్వాల్ మాత్రం క్రీజు మధ్యలోనే ఆగిపోయాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 102 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రోహిత్ శర్మ(3), కేఎల్ రాహుల్(24) త్వరగా ఔటైనా.. విరాట్ కోహ్లీతో కలిసి యశస్వి జైస్వాల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. తనకే సాధ్యమైన షాట్లతో బౌండరీలు రాబట్టాడు. 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న యశస్వి జైస్వాల్.. అనంతరం అదే జోరు కనబర్చాడు. బౌండరీలతో వేగంగా పరుగులు రాబట్టాడు. మరోవైపు కోహ్లీ సైతం ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్స్ జోలికి పోకుండా ఏకాగ్రతతో బ్యాటింగ్ చేశాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్ తీవ్ర ప్రయత్నాలు చేశాడు. కానీ యశస్వి జైస్వాల్ అనవసర పరుగు కోసం ప్రయత్నించి మూల్యం చెల్లించుకున్నాడు. ఆ వెంటనే ఏకాగ్రత కోల్పోయిన కోహ్లీ సైతం ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీని ఆడబోయి కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో 157 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో ఆకాశ్ దీప్(0 బ్యాటింగ్)తో పాటు రిషభ్ పంత్(3 బ్యాటింగ్) ఉన్నాడు.

# అదరగొట్టిన భారత మహిళలు

- ఆఖరి వన్డేలో 5 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ
- విండీస్‌తో వన్డే సిరీస్ క్లీన్ స్వీప్



సొంతగడ్డపై భారత మహిళల క్రికెట్ టీమ్ జోరు కొనసాగుతోంది. వెస్టిండీస్‌తో ఇప్పటికే టీ20 సిరీస్ కైవసం చేసుకున్న భారత్.. తాజాగా మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన ఆఖరి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీప్తి శర్మ (48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39 నాటౌట్, 6/31) ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 28.2 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. ఆ జట్టులో చిన్నెల్లె హెన్రీ(72 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 61) హాఫ్ సెంచరీతో రాణించగా.. కాంప్‌బెల్(62 బంతుల్లో 7 ఫోర్లతో 46) పర్వలేదనిపించింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్(4/29), దీప్తి శర్మ(6/31) విండీస్ పతనాన్ని శాసించా రు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 28.2 ఓవర్లలో 5 వికెట్లకు 167 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. టాప్-3 బ్యాటర్లు స్మృతి మంధాన(4), ప్రతికా రవల్(18), హర్లీన్ డియోల్(1) విఫలమైనా.. హర్మన్‌ప్రీత్ కౌర్(22 బంతుల్లో 7 ఫోర్లతో 32), జెమీమా రోడ్రిగ్స్(45 బంతుల్లో ఫోర్‌తో 29), రిచా ఘోష్(11 బంతుల్లో ఫోర్, 3 సిక్సలతో 23 నాటౌట్), దీప్తి శర్మ రాణించారు. వెస్టిండీస్ బౌలర్లలో డియాండ్రా డాటిన్, అలెన్, హీలీ మాథ్యూస్, కరిష్మా రామ్‌హరక్ తలో వికెట్ తీసారు. రిచా ఘోష్ వరుస సిక్సర్లతో విజయ లాంఛనాన్ని పూర్తి చేయడం గమనార్హం. తొలి వన్డేలో 60 పరుగుల తేడాతో గెలిచిన భారత్.. రెండో వన్డేలో 211 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అంతకుముందు జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది. తొలి టీ20లో 49 పరుగులతో గెలిచిన టీమిండియా.. రెండో టీ20లో 9 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. మూడో టీ20లో 60 పరుగుల తేడాతో విజయం సాధించింది.

# కష్టాల్లో టీమ్ఇండియా

- మళ్లీ ఆటగాళ్ల అదే తడబాటు
- 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు
- 474 పరుగుల భారీ స్కోర్ చేసిన ఆసిస్
- భారీ శతకంతో చెలరేగిన స్టీవ్ స్మిత్
- భారత్‌కు పొంచి ఉన్న ఫాలో ఆన్ గండం



మెల్‌బోర్న్ టెస్టులో టీమ్ఇండియా కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసేసరికి భారత్ 310 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. భారత్ ఫాలో ఆన్ గండం తప్పించుకోవాలంటే మరో 111 పరుగులు చేయాలి. తొలి ఇన్నింగ్స్?లో టీమ్ఇండియా 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజులో రిషభ్ పంత్ (6), రవీంద్ర జడేజా (4) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. రెండో రోజు తొలి సెషన్?లోనే టీమ్ఇండియా మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (82 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించినా, కెప్టెన్ రోహిత్ శర్మ (3) మరోసారి తడబడ్డాడు. కేఎల్ రాహుల్ (24) కాసేపు ఆకట్టుకున్నా ఇన్నింగ్స్?ను భారీ స్కోర్?గా మలచలేకపోయాడు. అయితే జైస్వాల్-విరాట్ మాత్రం క్రీజులో కుదురుకుపోయారు. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. మూడో వికెట్?కు ఈ జోడీ 102 పరుగులు జోడించింది. దీంతో భారత్ రెండు వికెట్ల నష్టానికే 150 పరుగుల మార్క్ అందుకుంది. కానీ, అక్కడే కథ మలుపు తిరిగింది. 41వ ఓవర్లో జైస్వాల్ రనౌట్ అయ్యాడు. దీంతో సెంచరీ భాగస్వామ్యం బ్రేక్ అయ్యింది. కొద్దిసేపటికే క్రీజులో పాతుకుపోయిన విరాట్ కూడా ఔటయ్యాడు. తర్వాత వరుస వికెట్లు పడుతున్న క్రమంలో నైట్?వాచ్?మెన్?గా ఆకాశ్ దీప్? (0)ను బరిలో దింపినా అతడు కూడా పెవిలియన్ చేరాడు. దీంతో టీమ్ఇండియా 6 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు 311/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేసింది. స్టీవ్ స్మిత్(197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సలతో 140) భారీ శతకంతో చెలరేగగా..సామ్ కోన్‌స్టాస్(65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలతో 60), ఉస్మాన్ ఖవాజా(121 బంతుల్లో 6 ఫోర్లతో 57), మార్నస్ లబుషేన్(145 బంతుల్లో 7 ఫోర్లతో 72)హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌కు రెండు వికెట్లు దక్కగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీసాడు. మహమ్మద్ సిరాజ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. కానీ ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. 23 ఓవర్లు బౌలింగ్ చేసిన సిరాజ్ 5.30 ఎకానమీతో 122 పరుగులిచ్చుకున్నాడు. అతని కెరీర్‌లోనే ఇది అత్యంత చెత్త రికార్డ్. సిరాజ్ వైఫల్యం ఆసీస్‌కు కలిసొచ్చింది. 311/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. స్మిత్ సెంచరీతో తమ ఆధిపత్యం కొనసాగించింది. 68 పరుగుల వ్యక్తిగత ఓవర్‌నైట్ స్కోర్‌తో బరిలోకి దిగిన స్మిత్.. 167 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతనికి మరో ఎండ్‌లో కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సహకారం అందించాడు. ఈ ఇద్దరూ భారత బౌలర్లను చెడుగుడు ఆడారు. వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. తొలి సెషన్ చివర్లో హాఫ్ సెంచరీకి చేరువైన ప్యాట్ కమిన్స్(49)ను జడేజా.. నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మిచెల్ స్టార్క్ రాగా.. మరో వికెట్ పడకుండా స్మిత్ జాగ్రత్తగా ఆడాడు. దాంతో ఆసీస్ 454/7 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే మిచెల్ స్టార్క్(15)ను జడేజా క్లీన్ బౌల్డ్ చేయగా.. ఆ మరుసటి ఓవర్‌లోనే స్టీవ్ స్మిత్ విచిత్రకర రీతిలో పెవిలియన్ చేరాడు. కాగా ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో స్టెప్ ఔటై స్మిత్ ఆఫ్ సైడ్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తాకిన బంతి అతని ప్యాడ్స్‌ను తాకి మెల్లిగా లెగ్ స్టంప్ బెయిల్‌ను కిందపడేసింది. నిస్సహాయంగా స్మిత్ చూస్తూ నిలబడిపోయాడు. నిరాశగా పెవిలియన్ చేరాడు. అసాధారణ బ్యాటింగ్ చేసిన స్టీవ్ స్మిత్‌కు మెల్ బోర్న్ ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా స్మిత్‌ను అభినందించాడు. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ కాసేపు భారత బౌలర్లను విసిగించారు. జడేజా, సిరాజ్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. దాంతో రోహిత్ బుమ్రాను రంగంలోకి దింపగా అతను నాథన్ లయన్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చి ఆసీస్ ఇన్నింగ్స్ తెరదించాడు.

# రోహిత్ శర్మ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు సరిగ్గా లేవు

- నాలుగో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు తేలిపోయారు
- వాషింగ్టన్ సుందర్ తుది జట్టులోకి ఎందుకు?
- భారత బౌలింగ్ ప్రదర్శనపై రవి శాస్త్రి అసంతృప్తి



టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయాలపై మాజీ హెడ్ కోచ్, కామెంటేటర్ రవి శాస్త్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు సరిగ్గా లేవని విమర్శించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు తేలిపోయారు. దాంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేసింది. స్టీవ్ స్మిత్(197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సలతో 140) భారీ శతకంతో చెలరేగగా..సామ్ కోన్‌స్టాస్(65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలతో 60), ఉస్మాన్ ఖవాజా(121 బంతుల్లో 6 ఫోర్లతో 57), మార్నస్ లబుషేన్(145 బంతుల్లో 7 ఫోర్లతో 72)హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌కు రెండు వికెట్లు దక్కగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీసాడు. మహమ్మద్ సిరాజ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న రవి శాస్త్రి.. బ్రేక్ సమయంలో భారత బౌలింగ్ ప్రదర్శనపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌తో బౌలింగ్ చేయించకపోవడాన్ని తప్పుబట్టాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ.. గంభీర్ వ్యూహాలు చెత్తగా ఉన్నాయని ఘాటుగా విమర్శించాడు. నమ్మకం లేనప్పుడు వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించాడు.'భారత బౌలింగ్ చెత్తగా ఉంది. టీమిండియా మేనేజ్‌మెంట్ వద్ద సరైన వ్యూహాలు లేవు. స్పిన్నర్లను వాడుకోవాల్సిన రీతిలో ఉపయోగించలేదు. జడేజా బంతి అందుకునే ముందు 40 ఓవర్ల గ్యాప్ ఉంది. వాషింగ్టన్ సుందర్ తొలి ఓవర్ వేసేందుకు కూడా చాలా సమయం పట్టింది. మరి ఎందుకు ఇద్దరు స్పిన్నర్లను తీసుకున్నారు. వారిపై నమ్మకం లేనప్పుడు వారిని తుది జట్టులోకి తీసుకోవడం ఎందుకు?'అని రవి శాస్త్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా 23 ఓవర్లు బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్ 15 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి ఓ వికెట్ మాత్రమే తీసాడు

# విరాట్ కోహ్లీకి క్షమాపణ చెప్పిన కెర్రీ ఒకీఫ్



విరాట్ కోహ్లీని 'అహంకారి' అని వ్యాఖ్యానించినందుకు ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ కెర్రీ ఒకీఫ్ క్షమాపణలు చెప్పాడు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో బాక్సింగ్ డే టెస్ట్ మొదటి రోజున ఆస్ట్రేలియా తరపున మొదటి మ్యాచ్ ఆడుతున్న సామ్ కాన్ స్టాస్ ను కోహ్లీ ఢీకొట్టడంపై అభ్యంతరం తెలిపిన ఒకీఫ్ అనుచితమైన పదాలను ఉపయోగించాడు. ఆస్ట్రేలియా మాజీ లెగ్ స్పిన్నర్, "కోహ్లీ తన కెరీర్ మొత్తాన్ని అహంకారంతో నిర్మించుకున్నాడు" అని విమర్శించాడు. 75 ఏళ్ల అతను తన తప్పును గ్రహించి టెస్ట్ మ్యాచ్ 2వ రోజు క్షమాపణలు చెప్పాడు. "విరాట్ కోహ్లీ ప్రవర్తనను అహంకారం అని పిలిచినందుకు నేను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నాను. నేను అలా అనకూడదు. అతను తనలాగే మరొక ఆటగాడు అహంకారం చూపడం చూసినప్పుడు అతను ఒకింత చిరాకు పడ్డాడు" అని ఒకీఫ్ పేర్కొన్నాడు. ఒకీఫ్ 1971 నుంచి 1977 మధ్య ఆస్ట్రేలియా తరఫున 24 టెస్టులు, రెండు వన్డేలు ఆడాడు. కాగా మెల్ బోర్న్ టెస్ట్ లో విరాట్ కోహ్లీ ఆసీస్ ఆటగాడు సామ్ కాన్ స్టాస్ ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఐసీసీ ప్రవర్తనా నియమావళి లెవల్ 1ను ఉల్లంఘించినందుకు కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించారు. అతను %×జజ% ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు గుర్తించారు. విరాట్ కోహ్లీ ప్రవర్తనపై ఆసీస్ మాజీ ఆటగాళ్లు మండిపడ్డారు. ఈ వివాదం పై కాన్ స్టాస్ స్పందించాడు. తాము ఇద్దరం కాస్త భావోద్వేగానికి గురయ్యామని చెప్పాడు. విరాట్ వస్తున్నట్లు తాను గమనించలేదని పేర్కొన్నాడు. గ్లవ్స్‌ను సరిచేసుకునే పనిలో ఉండగా ఇది జరిగిందని తెలిపాడు. కాగా మెల్ బోర్న్ టెస్ట్ లో ఇండియా పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా 5 వికెట్లు కోల్పోయి 164 పరుగులే చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 82 పరుగులు చేశాడు. అతను రన్ ఔట్ అయ్యాడు. విరాట్ కోహ్లీ 36 పరుగులు చేయగా.. కేఎల్ రాహుల్ 24, రోహిత్ శర్మ 3 పరుగులే చేశాడు. ప్రస్తుతం క్రీజ్ లో రిషబ్ పంత్, రవింద్ర జడేజా ఉన్నారు. భారత్ 310 పరుగుల వెనుకంజలో ఉంది.



# మనం ఏదైనా చేయగలం

## : సమంత

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

# మహిళలెవరూ సీఎం సమావేశానికి హాజరుకానవసరం లేదు : పూనమ్‌కౌర్



ఇండస్ట్రీలో ఉన్న సమస్యలపైనే కాకుండా సామాజిక అంశాలపై ఎప్పుటికపుడు గొంతు వినిపించే నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది పూనమ్ కౌర్. సోషల్ మీడియాలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని తెలిసిందే. ఈ భామ ఎప్పుడు ఏదో ఒక కామెంట్ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మహిళలెవరూ సీఎం సమావేశానికి వెళ్లేంత ముఖ్యమేం కాదంటోంది పూనమ్ కౌర్. ఈ మేరకు పూనమ్ కౌర్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. సీఎంతో సమావేశానికి మహిళలెవరూ కూడా ముఖ్యమైన వ్యక్తులుగా పరిగణించబడలేదు. ఎందుకంటే మహిళలకు ఎలాంటి సమస్యలుండవు. వ్యాపార సంబంధ విషయాలు, హీరోకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రం పరిశ్రమ నిలబడుతుంది. కానీ మహిళలెవరికీ సమస్య ఉండదు.. అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది పూనమ్ కౌర్. ఈ కామెంట్స్ సినీ ప్రముఖులతో భేటీను ఉద్దేశించి చేసినవేనంటూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ కామెంట్స్‌పై ఎవరెలా స్పందిస్తారనేది చూడాలి.

# వీరమల్లులో పాటపాడిన పవన్

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ ఏదైనా అప్‌డేట్ అందిస్తారేమోనని చూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్‌ను జనవరి 1న మధ్యాహ్నం 12 గంటలకు లాంచ్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ పాటను పవన్ కల్యాణ్ పాడటం విశేషం. తెలుగుతోపాటు మిగిలిన భాషల్లో కూడా పవన్ కల్యాణ్ వాయిస్‌తో పాట ఉండబోతుందట. ఇప్పటికే పవన్ కల్యాణ్ పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలువడమే కాదు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరి పీరియాడిక్ డ్రామాకు స్టార్ యాక్టర్ వాయిస్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించినట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.



# సల్మాన్ ఖాన్ సికిందర్ టీజర్ వాయిదా




బాలీవుడ్ స్టార్‌యాక్టర్ సల్మాన్‌ఖాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను ఇవాళ ఉద యం 11:07 నిమిషాలకు లాంచ్ చేయాల్సి ఉంది. అయితే మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్ను మూసిన విషయం తెలిసిందే. దేశమంతా సంతాపం ప్రకటిస్తున్న ఈ సమయంలో ఆయన మృతికి సంతాపంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నాం. టీజర్‌ను రేపు ఇదే (ఉదయం 11:07) సమయానికి లాంచ్ చేస్తామని అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్.

# రెండు పార్ట్‌లుగా విజయ్ దేవరకొండ గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్టు

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌత మ్ తిన్ననూరి కాంబినేషన్‌లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైన మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పుకోచ్చాడు.

